# జగన్నాథంపై వేటు

## ఆదికేశవులునూ వివరణ కోరాం

## తప్పని తేలితే చర్య తప్పదు: బాబు

**న్యూఢిల్లీ, న్యూస్‌టుడే:** పార్టీ విప్‌ను ధిక్కరించి బలపరీక్షలో యూపీఏ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేసిన నాగర్ కర్నూల్ ఎంపీ మందా జగన్నాథాన్ని తెలుగుదేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. ఓటింగ్ సమయంలో అనుమానాస్పదంగా వ్యవహరించిన చిత్తూరు ఎంపీ ఆదికేశవులునాయుడినీ వివరణ కోరినట్లు చెప్పారు. విప్‌కు వ్యతిరేకంగా ఓటేసినట్లు తేలితే ఈయన మీదా చర్య తీసుకుంటామని బుధవారమిక్కడ స్పష్టంచేశారు. పార్టీ గుర్తుపై గెలిచిన ఎవరైనా విప్‌కు అనుగుణంగానే ఓటేయాలని, ధిక్కరిస్తే ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తిస్తుందని తెలిపారు. సభ్యులు ఆత్మప్రబోధానుసారం ఓటేయాలనుకుంటే సొంతంగా గెలిచి రావాలని హితవుపలికారు. జగన్నాథానికి డబ్బులు ముట్టాయని భావిస్తున్నారా అని అడుగగా.. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటేసిన వారికి కచ్చితంగా డబ్బులు ముట్టాయని పేర్కొన్నారు. పి.వి.నరసింహారావు విశ్వాసపరీక్ష సమయంలో పార్టీ ఫిరాయించిన ఆరుగురు ఎంపీలు చరిత్రలో కలిసిపోయారని గుర్తుచేశారు. తాజా ఓటింగ్‌లో పార్టీల ఆదేశాలను ధిక్కరించి వ్యవహరించిన 25 మందిలో ఎవరూ డబ్బులు తీసుకోకుండా లేరని ఆరోపించారు. యూపీఏకి ఓటేసి.. దేశభక్తి గీతం ఆలపిస్తున్నారని, దేశంపై అంత భక్తి ఉంటే మళ్లీ గెలిచివచ్చి ఓటు వేయాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మంగళవారం సాయంత్రం వరకూ జగన్నాథం తనతోనే ఉన్నారని, అణు ఒప్పందంపై ఆయన అభిప్రాయాలను తనకెన్నడూ చెప్పలేదని తెలిపారు. పార్టీలో అవమానం జరిగిందంటూ జగన్నాథం చేసిన ఆరోపణలను బాబు ఖండించారు. పదేళ్లుగా పొలిట్‌బ్యూరోలో కొనసాగించడం, మూడుసార్లు ఎంపీ టికెట్ ఇవ్వడం అవమానించడమా అని ప్రశ్నించారు. విప్‌ను ధిక్కరించిన జగన్నాథంపై చర్య తీసుకోవలసిందిగా సభాపతిని కోరతామని తెలిపారు.